# ఛాయాచిత్రం

ఆర్. యస్. కృష్ణమూర్తి

అగ్గదీ! అప్పుడొచ్చింది ఫ్లాష్‌లా ఆలోచన.

ం ం ం

ఈ ఇరవయ్యో శతాబ్దపు నవనాగరికపు పరుగుల్లో, ముందుకు తోసుకు పైపైకి పోయే తొందర్లో—

మిట్ట మధ్యాహ్నపు వెలుగులోనే చీకట్లను వెదికే మనం కళ్ళెదురుగా వున్నవికూడా చూడ లేని వెన్నో—

సామాజిక రుగ్మతల్ని వెతికి వెలికి తీసి చూపి, సమకాలీన సమాజానికి దర్పణం పట్టేది కళ!

సాంఘిక అసమానతలను సెంటీమీటరు తయామీటరు గాజుముక్క లోంచి, కాగితం మీదకు కావాల్సినంత పెద్దది గానూ లేదా కావల్సినంత చిన్నదిగానూ కట్టిపడేసి చూపించే కళ—ఫొటోగ్రఫీ!!

ఇందులోనూ పరుగూ, వేగం....ఎవరు ముందు? అందుకే ఈ పందెం. పరుగు పందెం లేదా ఫొటోగ్రఫిక్ కంటెస్ట్.

టాపిక్ - జీవన పోరాటంలో మానవుడి ఆరాటం!

విజేతకు వినూత్న అవకాశం!...కళా ప్రశంసతో పాటు నగదు వెయ్యి నూట పదహార్లు!!

జగన్నాథం ఫొటోగ్రాఫర్ — ఆర్టిస్టిక్ ఫొటోగ్రాఫర్. జీవితాన్ని ఎంతో చాకచక్యంగా, ఎంతో చాతుర్యంతో ఫొటో ఫ్రేంలో బిగించ గల నేర్పరి.

జగన్నాథానికి జీవితమే ఒక ఛాలెంజ్. ఎప్పుడు అతను ఛాలెంజ్‌నే ఛాలెంజ్ చేస్తాడు. అందుకే 'సై' అన్నాడు.

చాలా శోధించి సాధించాడు

ఎంతో మంది చూడలేని, చూడని దాన్ని జగన్నాథం చూశాడు. అవును....అక్షరాలా అదే రూపం!

జగన్నాథం చూసింది మరెక్కడో కాదు. అందమైన అద్దాల బీరువాలో—

నీటుగా నిల్చున్న సాహిత్య ప్రపంచంలో-

బంధించబడి వున్న 'మహా ప్రస్థానం' లో.

అగ్గదీ! అప్పుడొచ్చింది ఫ్లాష్‌లా ఆలోచన!

"శ్రీశ్రీ! థేంక్యూ శ్రీశ్రీ" అనుకున్నాడు జగన్నాథం.

ం ం ం

బ్లాక్ అండ్ వైట్‌లో, లైఫ్ సైజు ఫ్రేములో మెజస్టిక్‌గా నిల్చుంది ముష్టి ముసిలిది — జగన్నాథం ఎంట్రీ!

ఎంగిలాకుల్లో మెతుకులు ఆత్రంగా దగ్గరకు తీసుకుని ఆబగా, ఆరాటంగా నోట్లో కుక్కుకుంటూంది. కాంతి లేని గాజు కళ్ళలో దైన్యం, భయం, తొందరపాటూ తొంగిచూస్తూ వుంటే, కుక్కతో, ఎంగిలాకుతో పోటీ పడుతూ-సర్వ సజీవ కోటితో సమానత్వం ప్రతిబింబిస్తూంది!





జగన్నాథం పరికించి చూస్తున్నాడు.

అందరి తలలూ ఊగినా ఒకటే, ఊడినా ఒకటే, జడ్జీల తలలు వూగాయా లేదా?.... యస్, యస్! దిస్ ఈజ్ ది ఎంట్రీ!...అవును...ఇదే బహుమతి పొందిన, కళలు పొంగిన, ఎముకలు కుళ్ళిన భిక్షువర్షీయసి చిత్రం. అది బహుమతి పొందడంతో లేనేలేదు చిత్రం పొందక పోతేనే విచిత్రం!

కళా ప్రశంసలు...అభినందనలు అందుకున్నాడు జగన్నాథం చిద్విలాసంగా. వెయ్యి

నూట పదహార్లు జేబులో దోపుకున్నాడు సంతోషంగా. మనసు నిండా ఆనందం

నవ్వుకున్నాడు మనసారా.

మనస్సు కుళ్ళిన మానవులారా ఛావండి!

ఆనందంగా కారు డోర్ తెరిచి స్టీరింగు ముందు కూర్చున్నాడు-పక్కనే తన అసాహీ పెంటాక్స్ కెమెరా. మనిషి తలను తడిమినటు ఆప్యాయంగా కెమెరాను తడిమాడు.

ఆగండాగండి! ఏమిటి వీడు—ఈ రచయిత గాడు!

ఫొటోగ్రాఫర్ కి—కారా?

యస్! వై నాట్?... యూ డోంట్నో?

జగన్నాథం ఈజే లేఖియర్?

ఫొటోగ్రఫీ?....అతని హాబీ.

హౌవండర్ ఫుల్! అంత పెద్ద వాడు, ఇంత చిన్న విషయం మీద—అదే, సాంఘిక అసమానత-ఆసక్తి చూపించటం ఎంత గొప్ప విషయం? ఎంతైనా హర్షదాయకం కాదూ?....యస్. యస్.....ఏథౌజండ్ టైమ్స్ యస్!

జగన్నాథానికి అందుకు కూడా ఆనందంగా వుంది. అతనేది చేసినా సిస్టమేటిగ్గా, సైంటిఫిగ్గా, ప్లాన్డ్ గా చేస్తాడు. అందుకే ఎప్పుడూ అతనిదే జయం.

రండి. మీరూ జగన్నాథం ఇంట్లోగెట్టు గదర్ కి రండి. మీరూ అతన్ని కంగ్రాచ్యులేట్ చెయ్యండి బట్ డోంట్ వేస్ట్ హిజ్ వేల్యూబుల్ టైం, కాలం అతనికి చాలా విలువైంది—మీకు కాదు. అందుకే అతనికి కారుంది-మీకు లేదు.

జగన్నాథం టైం చూసు కున్నాడు. చీకట్లో రేడియం డయల్ ఎనిమిదిన్నర అంటూంది.

అబ్బ! ఎంత ఆలస్యం అయిపోయింది! అంతావచ్చేసి వుంటారు. ఎంత వేగం అనుకున్నా తెమిలింది కాదు. మైకు ముందు నిల్చుంటే వక్తలకి ఒళ్లూపై తెలియదు. జనాన్ని కురుపుసలిపినట్టు సలిపిగాని వదలరు! అందరికీ తప్పినా, తనకి తప్పలేదు. హరిదాసు పరచుకున్నతివాచీ తనది! ఆఖరుదాకాఆగాలి. అసలిటువంటిసభల్లో బహుమతి ప్రదానం ముందు జరిగి పోవాలి. ఆ తర్వాతే స్పీచెస్ ఎట్సెట్రా అనింపార్టెంట్ థింగ్స్!

కారు స్టార్టు చేసి హెడ్ లైట్లు ఆన్ చేశాడు. హెడ్ లైట్లు వెలగటం లేదు. డామిట్! ఏమైంది? ఏమో. రేపు అజంతా గరాజ్ లో పారేస్తే వాడే చూసుకుంటాడు. ఇప్పుడు టైంలేదు. వేగం వెళ్ళాలి.

ఐకెన్ మేనేజ్, ఆఫ్ కోర్స్! నేనుడ్రైవింగ్ లో ఎక్స్ పర్ట్ ని-లైకిన్ ఎవ్విరి అదర్ ఫీల్డ్!

ఏక్సిలేటరు గట్టిగా నొక్కాడు. ఒక్కదాటుతో గుర్రం లాలంఘించింది జగన్నాథ రథం. రోడ్లన్నీ చుట్టుకుంటూ, చీకట్లో వెలుగు చూసుకుంటూ, సాటిలేని చాకచక్యంతో, జనాన్నితప్పుకుంటూ....

స్కీచ్! కారాగి పోయింది.

"ఓర్నాయినో! సచ్చిపోన్రో!"

ఎవరది కారుకింద?— చీకట్లో చీకట్లోల్సిపోయి?

దిగిచూశాడు. ఒక్కసారి తేలిగ్గా నిట్టూర్చాడు.

థాంగాడ్! ఇంకా ఎవరో అనుకున్నా. ఏమైపోతుందోనని కలవర పడిపోయా. గెట్టుగెదర్ అభాసవుతుందని భయపడ్డా. హమ్మయ్య! మరేం పర్వాలేదు.

మొన్న ఫోటో కంటెస్ట్ కోసం వెతికి వెతికి పట్టుకొచ్చి ఎంగిలాకుల్లో పడేస్తే, దానికితెలియకుండా కుక్కని ఉసికొల్పి వదిలేస్తే, కుక్కతో కాట్లాడి, కుక్కతో కలిసి కుక్కలా, ఆత్రంగా భోంచేసిన కుక్కముండే. ముష్టిముండే, మరేం పర్వాలేదు.

గుడ్ రిడెన్స్!- గరీబీ హటావో!

ఎవరూ చూడలేదు.

ఎవరూ చూడ బోరు

నిత్యం చచ్చే పీరికి

ఏడ్చేవాడూ లేడు.

కారుకేం దెబ్బ తగల్లేదు కదా?

నో. కారు కేమీ అవలేదు.

గుడ్! వెరీగుడ్!!

మరింత వేగంతో ముందుకు కదిలిపోయింది జగన్నాథ రథం!

*

# పిరికివాడు

## పవని.రా. భానుమూర్తి

సుదర్శనం మంచివాడో, చేతకాని వాడో, పిరికివాడో నాకు తెలియదు. నాకు తెలియదు అనడం కంటే నేను చెప్పలేను అనడం సబబు. ఎందుకంటే లోకంలో ఒక్కోసారి మంచితనాన్ని చేతగానితనంగాను మరీ ఒక్కోసారి పిరికితనంగాను జమకట్టడం నేనెరుగుదును. ఎటొచ్చీ నాకింతవరకూ స్పష్టంగా తెలియని విషయం సుదర్శనం ఈ మూడు తెగల్లో దేనికి చెందుతాడనే. బహుశా-ఈ మూడూ అతనిలో ఉన్నాయేమో అని కూడా నాకు అనిపిస్తుంది. ప్రస్తుతం-ఈ చర్చ వదిలి సుదర్శనం కథ చెపితే మంచిది.

సుదర్శనం అద్దం ముందు నిలబడి తల దువ్వుకుంటున్నాడు. కాలేజీ కెళ్ళడానికి అర గంట టైముంది. సుదర్శనానికి తొందర ఎక్కువవుతూంది. తొందర పెరిగే కొద్దీ 'క్రాపు' సరిగ్గా రావడం ఆలస్యమవుతోంది. యింతకీ అతనికెందుకా తొందర?

అంతకు ముందు రోజు సుదర్శనం కాలేజి వదలగానే యింటికి వస్తున్నాడు. ఆ దారిలోనే అనురాధ ఇల్లు. అనురాధ అతని క్లాస్ మేట్. అయినా, ఇంతవరకూ వాళ్ళిద్దరూ మాట్లాడుకోలేదు. అసలు సుదర్శనంలో అంత చొరవ లేదు. సుదర్శనం అలా వస్తుండగా గేటు వద్ద నిలబడి చూస్తున్న అనురాధ కనబడింది. సుదర్శనం వైపు చూసింది. సుదర్శనం చటుక్కున తల తిప్పుకున్నాడు. అనురాధ ఇల్లు దగ్గరయే కొద్దీ అతని గుండె వేగం హెచ్చింది. కాళ్ళలో వణుకు ప్రారంభమయింది, అడుగులు తడబడుతున్నాయి.

"సుదర్శన్ గారూ" అనూరాధ పిలిచింది.

సుదర్శనం గుండె వేగం నాలుగుతో హెచ్చవేసినట్టుగా పెరిగింది. మెల్లిగా తల తిప్పి చూశాడు. అనూరాధ రమ్మన్నట్టుగా చేయి ఊపింది. తడబడుతూ వెళ్ళి గేటు ముందు తలవంచుకు నిలుచున్నాడు. అనూరాధ కతని ధోరణి నవ్వు తెప్పించింది. ఐనా ఆపుకుంది.

"నేనీ రోజు క్లాసుకు రాలేదు. ఇంగ్లీషు నోట్సిస్తారా. రాసుకుని రేపిస్తాను" అన్నది.

రేపు అడిగిన ప్రశ్నలకు జవాబియ్యకపోతే యిక క్లాసుకు రానివ్వనని ఇంగ్లీషు లెక్చరర్ చేసిన హెచ్చరిక సుదర్శనానికి జ్ఞాపకం వుంది. తనకు కొన్ని పాఠాలు రావని కూడా అతనికి గుర్తుంది.

"రేపు ఇంగ్లీషు లెక్చరర్ ప్రశ్నలడుగుతాడండీ. నాకు సరిగ్గా రావు. ఈ రోజు నేర్చుకోవాలి. సారీ"

ఈ మాటలు సుదర్శనం అనలేదు. అందామనే అనుకున్నాడు. అనలేకపోయాడు.

ఆ మాటలు గొంతు లోనే ఆగిపోయాయి.

"సరేనండీ" అని నోట్సుతీసి అనూరాధ కిచ్చాడు. గబగబా ఎవరో తరుముతున్నట్టు ఇంటికొచ్చి పడ్డాడు.

అందుకే అతనికి ఆ రోజింత తొందర. తొందరగ తయారయి అనూరాధ యింటి కెళ్ళి నోట్సు యిప్పించుకోవాలి. ఫస్టవరే ఇంగ్లీషు